## క్లుప్తంగా

### దరఖాస్తుల ఆహ్వానం

కనగల్ : మండల పరిధిలోని బుడుమర్లపల్లి శ్రీఆక్కెనపల్లి వెంకటేశ్వర్‌రావు మెమోరియల్ ఆదర్శ పాఠశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్న ప్రిన్సిపాల్ మమత శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ఈ నెల 22వ వరకు ఇంటర్ ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపుల్లో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు పాఠశాలలో సంప్రదించాలన్నారు.

కేతేపల్లి : మండలంలోని కొర్లపహాడ్ మోడల్ స్కూల్‌లో ఇంటర్ ప్రథమ సంవత్సరం ఇంగ్లిష్ మీడియంలో ప్రవేశాలకు ఈ నెల 25వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ సబితారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపుల్లో ఒక్కో దాంట్లో 40 సీట్లు అందుబాటులో ఉన్నాయని అన్నారు. దరఖాస్తుతోపాటు ఆధార్ కార్డు, పదో తరగతి ఉత్తీర్ణత, కుల ధృవీకరణ పత్రాలు, పాస్‌ఫొటోలు కళాశాలలో అందజేయాలని సూచించారు.

### సబ్సిడీపై జీలుగ, జనుము విత్తనాలు

కేతేపల్లి : రైతులకు అవసరమైన జీలుగ, జనుము విత్తనాలు సబ్సిడీపై పంపిణీ చేసేందుకు మండల కేంద్రంలోని సింగిల్‌విండో కార్యాలయంలో అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి బి.పురుషోత్తం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విత్తనాలు అవసరమైన రైతులు పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, సెల్ నంబర్‌తో వ్యవసాయ అధికారి కార్యాలయంలో సంప్రదించాలన్నారు. 30 కిలోల జీలుగ విత్తనాల బస్తా సబ్సిడీ పోను రూ.843, జనుము 40 కిలోల బస్తా రూ.1225 చెల్లించాలని తెలిపారు.

### దాడిచేసిన వారిని అరెస్టు చేయాలి

నల్లగొండ టౌన్ : ప్రేమ వివాహం చేసుకున్నాడనే నేపంతో పెద్దవూర మండలం శిరసనగండ్ల గ్రామంలోని దళితవాడపై దాడిచేసిన వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా కార్యదర్శి పాలడుగు నాగార్జున శుక్రవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రేమ వివాహం చేసుకున్న వారికి తగిన రక్షణ కల్పించాలన్నారు.


### గిరిజన బంధు ప్రకటించాలి

నల్లగొండ టూటౌన్ : ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన ఎరుకల కులస్తులకు గిరిజన బంధు ప్రకటించాలని తెలంగాణ ప్రదేశ్ ఎరుకల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కందుల అంజయ్య శుక్రవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రతి కుటుంబానికి ఎకరం భూమి, డబుల్ బెడ్‌రూం ఇళ్లు, రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఐదు ఎమ్మెల్యే, రెండు ఎమ్మెల్సీ సీట్లు కేటాయించాలన్నారు.

### కులవృత్తులకు కేసీఆర్ బాసట

నల్లగొండ టూటౌన్ : కులవృత్తులు చేసుకునే వారికి లక్ష రూపాయల చొప్పున ఆర్థిక సహాయం అందించాలని నిర్ణయం తీసుకొని కేసీఆర్ ప్రభుత్వం బాసటగా నిలిచిందని ఎంబీసీ జాతీయ కన్వీనర్ కొండూరు సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విశ్వబ్రాహ్మణులు, నాయీ బ్రాహ్మణులు, రజక, కుమ్మరి మేదర తదితర వృత్తులకు మేలు కలగనుందని అన్నారు.

### రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శిగా రాజారాం



నల్లగొండ రూరల్ : తెలంగాణ గవర్నమెంట్ కాలేజీల గెజిటెడ్ అధ్యాపకుల సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శిగా నల్లగొండ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు చెందిన గ్రంథాలయ అధ్యాపకుడు సుంకరి రాజారాంను రాష్ట్ర సంఘం శుక్రవారం ప్రకటించింది. ఈ సందర్భంగా రాజారాం మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన అసోసియేషన్ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.

### 'కంటి వెలుగు' ప్రారంభం

చిట్యాల : మండలంలోని పేరేపల్లి గ్రామంలో కంటి వెలుగు వైద్య శిబిరాన్ని శుక్రవారం ఎంపీపీ కొలను సునిత వెంకటేష్‌గౌడ్, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు, పేరేపల్లి సర్పంచ్ అంతటి వెంకటేష్‌గౌడ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఆనగంటి కిరణ్, వైద్యాధికారి నర్సింహ, కంటి వెలుగు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

శాలిగౌరారం: మండలంలోని రామగిరి గ్రామంలో గల ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు పరీక్ష కేంద్రాన్ని శుక్రవారం సర్పంచ్ బండారు శంకర్ ప్రారంభించారు. మండల వైద్యాధికారి వెంకన్న, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి చాడ హతీష్‌రెడ్డి, నాయకులు తొట్ల పుల్లయ్య, నిమ్మల సత్యనారాయణ, శీలం శంకర్, పరమేశ్, వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.



చిట్యాల: పేరేపల్లిలో కంటి వెలుగు శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ, సర్పంచ్

# అధ్వాన రోడ్డుతో అవస్థలు

- కంకర తేలి, కంపచెట్లు కమ్మేసిన గొల్లగూడెం- ఇస్మాయిల్‌పల్లి రోడ్డు
- ఇబ్బందులు పడుతున్న రైతులు, వాహనదారులు
- మరమ్మతు చేయాలని వేడుకోలు



గొల్లగూడెం-ఇస్మాయిల్‌పల్లి బాటను కమ్మేసిన కంపచెట్లు



గొల్లగూడెం రోడ్డుపై ధ్వంసమైన కల్వర్టు గూనలు



కంకరతేలిన గొల్లగూడెం-ఇస్మాయిల్‌పల్లి లింక్‌రోడ్డు

కట్టంగూర్ : మండలంలోని జాతీయ రహదారిపై ఉన్న ఎరసానిగూడెం స్టేజీ నుంచి గొల్లగూడెం గ్రామం మీదుగా ఇస్మాయిల్‌పల్లి గ్రామానికి వెళ్లే రోడ్డు అధ్వానంగా ఉంది. ఈ దారి గుండా వెళ్లేందుకు రైతులు, ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. జాతీయ రహదారిపై ఉన్న ఎరసానిగూడెం స్టేజి నుంచి ఇస్మాయిల్‌పల్లి గ్రామం వరకు సుమారు 2 కిలోమీటర్ల దూరం ఉంటుంది. ఈ దారిగుండా నిత్యం ప్రజలు, రైతులు, ద్విచక్ర వాహనదారులు వెళుతుంటారు. బాటకు ఇరువైపులా కంపచెట్లు పెరగడంతోపాటు కంకర తేలడంతో వాహనదారులకు, రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఎలాంటి మరమ్మతులకు నోచుకోకపోవడంతో నిత్యం వ్యవసాయబావుల వద్దకు వెళ్లే రైతులు నానా అవస్థలు పడుతున్నారు. రాత్రి పూట ఈ దారిగుండా వెళ్లేందుకు రైతులు, ద్విచక్ర వాహనదారులు జంకుతున్నారు. ముతాలమ్మగూడెం జీపీ పరిధి చిన్నపురి గ్రామంలో గల పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రానికి, ఎరసానిగూడెం ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ట్రాక్టర్లలో ధాన్యం తరలించేందుకు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఇస్మాయిల్‌పల్లి, పిట్టంపల్లి గ్రామాలకు చెందిన రైతులు గొల్లగూడెం మీదుగా ధాన్యం తరలించేందుకు ఇబ్బందిగా ఉండడంతో పామనగుండ్ల మీదుగా ధాన్యం తరలిస్తున్నారు.

**రోడ్డుపైనే ప్రవహిస్తున్న నీరు**

ఇస్మాయిల్‌పల్లి గ్రామంలోని హనుమాన్ టెంపుల్ సమీపంలో పొలాల వరద నీరు నిత్యం రోడ్డుపై నుంచి ప్రవహిస్తుంది. దీంతో రాకపోకలకు తీవ్ర ఆటంకం కలుగుతోంది. ఈ ప్రాంతంలో కల్వర్టు నిర్మించాలని రైతులు కోరుతున్నారు. సమస్యను పరిష్కరించాలని సంబంధిత అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కంపచెట్లను తొలగించడంతోపాటు కంకర రోడ్డును బీటీ రోడ్డుగా మార్చాలని వాహనదారులు, ప్రజలు, రైతులు కోరుతున్నారు.

**ధ్వంసమైన కల్వర్టు గూనలు**

జాతీయ రహదారి పై ఉన్న ఎరసానిగూడెం స్టేజీ నుంచి గొల్లగూడెం వెళ్లే దారిలో రోడ్డు పై నిర్మించిన కల్వర్టు సిమెంట్ గూనలు ధ్వంసమై రంధ్రాలు ఏర్పడ్డాయి. దీంతో ఈ దారిగుండా రాత్రి పూట వెళ్లే ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ధ్వంసమైన కల్వర్టుకు మరమ్మతులు చేపటి కొత్త గూనలు వేసి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

**బీటీ రోడ్డుగా మార్చాలి**



ఇస్మాయిల్‌పల్లి నుంచి గొల్లగూడెం గ్రామం మీదుగా ఎరసానిగూడెం స్టేజీ వర కు నిత్యం వందలాది మంది ప్రజలు, వాహనదారులు పలు పనుల నిమిత్తం మండల కేంద్రానికి వెళుతుంటారు. ఈ దారి పొడవునా కంపచెట్లతోపాటు కంకరతేలి రోడ్డు ప్రమాదకరంగా మారింది. రోడ్డుకు ఇరువైపులా కంపచెట్లను తొలగించి, ధ్వంసమైన కల్వర్టుకు మరమ్మతులు చేపట్టాలి. కంకర రోడ్డును బీటీ రోడ్డుగా మార్చాలి

– మేడబోయిన ఏడుకొండలు, రైతు, గొల్లగూడెం

# ధాన్యాన్ని మిల్లులకు తరలించాలి

- నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య



సమావేశంలో మాట్లాడుతున్న నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

నార్కట్‌పల్లి : మిల్లర్లు, అధికారులు సమన్వయంతో పనిచేసి కేంద్రాల్లో ఉన్న ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నార్కట్‌పల్లి, చిట్యాల మండలాల్లోని మిల్లుల యాజమానులు, డీఆర్‌డీఏ, సివిల్ సప్లయ్, కో ఆపరేటివ్ అధికారులతో సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. మిల్లులకు చేరిన ధాన్యాన్ని వెంటనే దిగుమతి చేసుకోవాలన్నారు. లారీలు, ట్రాక్టర్లను ఐకేపీ, పీఏసీఎస్ కేంద్రాలకు పంపించి నిల్వ ఉన్న ధాన్యాన్ని మిల్లులకు తరలించాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్‌డీఓ కాళిందిని, అడిషనల్ డీఆర్‌డీఓ సరస్వతి, మార్కెట్ డీపీఎం అరుణ్‌కుమార్, నకిరేకల్ డీపీఎం మోహన్‌రెడ్డి, డీసీఓ శ్రీనివాస్, కో ఆపరేటివ్ అధికారి చైతన్య, ఎస్‌సీఆర్‌పీ స్వాతి, ఏపీఎంలు దూదిమెట్ల శ్రీనివాస్, పద్మ, వినోద, ప్రభాకర్, యాదమ్మ, ఆర్‌ఐలు జావిద్, లింగస్వామి తదితరులు ఉన్నారు.

# కొనుగోళ్లు వేగవంతం చేయాలని ధర్నా



ధర్నా చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు

కట్టంగూర్ : లారీల కొరత తీర్చి ధాన్యం కొనుగోళ్లు, ఎగుమతులు వేగవంతం చేసి రైతులు ఆదుకోవాలని కాంగ్రెస్ పార్టీ నకిరేకల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ దైద రవీందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని ఈదులూరు, పందెనపల్లి గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ కొనుగోళ్లు ప్రారంభమై నెల రోజులు గడుస్తున్నా ఈ రెండు కేంద్రాల్లో 80 శాతం పైగా ధాన్యం నిల్వ ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రెడ్డిపల్లి సాగర్, గార్లపాటి రవీందర్‌రెడ్డి, చింత వెంకటనర్సు, మారబోయిన వెంకట్‌నారాయణ, నిమ్మనగోటి వెంకట్, నల్లమాద రవి, బాలకృష్ణ, చలకపల్లి వెంకన్న, సత్తయ్య, మాధవరెడ్డి, ఆదిరెడ్డి, శ్రీను, సత్యనారాయణ, పెండెం జయప్రకాశ్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ విత్తనాలు విక్రయిస్తే పీడీ యాక్టు నమోదు



మునుగోడు : విత్తనాలు పరిశీలిస్తున్న అధికారులు



మర్రిగూడ : దుకాణాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

మునుగోడు : వ్యాపారులు రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే పీడీ యాక్టు నమోదు చేస్తామని ఎస్ఐ డి.సతీష్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో వ్యవసాయ అధికారి ఎస్. శ్రీనివాస్‌తో కలిసి పలు ఫర్టిలైజర్ దుకాణాల్లోని పత్తి, ఇతర విత్తనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతి వ్యాపారి గుర్తింపు పొందిన విత్తనాలు మాత్రమే విక్రయించాలని సూచించారు.

**నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు**

చిట్యాల : రైతులకు నకిలీ విత్తనాలు, ఎరువులు అమ్మే దుకాణ యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని చిట్యాల ఎస్ఐ నకిరేకంటి ధర్మా, ఏఓ పగిడిమర్రి గిరిబాబు హెచ్చరించారు. చిట్యాల పట్టణంలోని పలు ఎరువుల దుకాణాల్లో శుక్రవారం వారు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో అక్రమంగా విత్తనాలు, ఎరువులు అమ్మితే చర్యలు తీసుకుంటామన్నారు.

**విత్తన దుకాణాల తనిఖీ**

మర్రిగూడ : మండల కేంద్రంలోని విత్తన, ఎరువుల దుకాణాలను శుక్రవారం ఎస్ఐ రంగారెడ్డితో కలిసి ఏఓ ఆవుల స్పందన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డీలర్లు నాణ్యమైన పత్తి విత్తనాలను రైతులకు విక్రయించాలని సూచించారు. రైతులు కూడా లైసెన్స్ కలిగిన దుకాణాల్లో మాత్రమే విత్తనాలు కొనుగోలు చేసి బిల్లులు తీసుకోవాలన్నారు. సీజన్ అయిపోయే వరకు రైతులు బిల్లులు భద్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఎవరైనా ప్రభుత్వం జారీ చేసిన లైసెన్స్ లేకుండా విత్తనాలను విక్రయిస్తే పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

# మిషన్లు మూడు.. నేర్చుకునేది 25 మంది



సరిపడా మిషన్లు లేకపోవడంతో ఖాళీగా కూర్చున్న బాలికలు

మునుగోడు : వేసవి శిక్షణలో భాగంగా కిశోర బాలికలకు నల్లగొండ మహిళా ప్రాంగణం ఆధ్వర్యంలో ఉచితంగా కుట్టు మిషన్, బ్యూటీషియన్ కోర్సులను మునుగోడులోని ఐసీడీఎస్ కార్యాలయంలో నేర్పిస్తున్నారు. 45 రోజుల పాటు ఇచ్చే శిక్షణకు కుట్టు మిషన్‌కు 25 మంది, బ్యూటీషియన్‌కు 25 మంది చొప్పున మొత్తం 50 మంది కిశోర బాలికలను ఎంపిక చేసి 25 రోజులుగా శిక్షణ ఇస్తున్నారు. అయితే కుట్టు మిషన్ శిక్షణ కోసం 25 మందికి అధికారులు కేవలం మూడు మిషన్లు మాత్రమే ఏర్పాటు చేయడంతో బాలికలందరూ శిక్షణ పొందలేకపోతున్నారు. కేవలం మూడు మిషన్లు మాత్రమే ఉండడంతో అందరం శిక్షణ పొందలేకపోతున్నామని పలువురు బాలికలు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి బాలికలకు సరిపడా మిషన్లు ఏర్పాటు చేసి శిక్షణ ఇవ్వాలని పలువురు కోరుతున్నారు.

# సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం



నార్కట్‌పల్లి : పాలాభిషేకం చేస్తున్న వీఆర్‌ఏలు



మునుగోడు : పాలాభిషేకం చేస్తున్న వీఆర్‌ఏలు



మర్రిగూడ మండలంలో..

మునుగోడు : వీఆర్‌ఏలను రెగ్యులరైజ్ చేయాలని రాష్ట్ర కేబినెట్ నిర్ణయం తీసుకోవడంపై హర్షం వ్యక్తం చేస్తూ వీఆర్‌ఏల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం మునుగోడు అంబేద్కర్ చౌరస్తాలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌ఏల సంఘం మండల అధ్యక్షుడు చింతపల్లి మల్లయ్య, కార్యదర్శి పోగుల లింగస్వామి, ఉపాధ్యక్షుడు ఓగ్గు యాదయ్య, సభ్యులు ఎస్.కె రహీమాన్, నర్సింహ, అద్దంకి వెంకటయ్య, నాగమణి, చంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

మర్రిగూడ : వీఆర్‌ఏలను రెగ్యులరైజ్ చేస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకోవడంపై హర్షం వ్యక్త చేస్తూ శుక్రవారం మండల కేంద్రంలో వీఆర్‌ఏలు సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌ఏలు పిట్టల పాండు, బుచ్చయ్య, జంగయ్య, లాలయ్య, సాయిలు, పెద్దులు, సుగుణమ్మ, అలివేలు, మంగమ్మ, రాములు పాల్గొన్నారు.

కనగల్ : వీఆర్‌ఏలను రెగ్యులరైజ్ చేయాలని కేబినెట్ నిర్ణయం తీసుకోవడంపై హర్షం వ్యక్తం చేస్తూ మండలంలోని వీఆర్‌ఏలు శుక్రవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌ఏలు పగిడిపాటి నవీన్, వెంకన్న, రామకృష్ణ, విజయ్, రాంబాబు, శంకర్, రామలింగయ్య తదితరులు పాల్గొన్నారు.

నార్కట్‌పల్లి : వీఆర్‌ఏలను రెగ్యులరైజ్ చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంపై హర్షం వ్యక్తం చేస్తూ శుక్రవారం మండల కేంద్రంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి నార్కట్‌పల్లి మండలంలోని వీఆర్‌ఏలు పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం తహసీల్దారు కార్యాలయంలో స్వీట్లు పంపిణీ చేశారు. సంఘం మండల అధ్యక్షుడు బొల్లెద్దు లింగస్వామి, దర్శ రవీందర్ శ్రీపతి ఎల్లయ్య, ఎండీ జానిమియా, వెంకటరమణ, శివకుమార్, భీమయ్య, లతీఫ్, పని కృష్ణ, నర్సింహ, మల్లయ్య, నర్సింహ, వెంకటేష్, మల్లయ్య, వెంకయ్య, కృష్ణవేణి, రజిత, సంతోషి, ఇందిర తదితరులున్నారు.

# సుందరయ్య స్ఫూర్తితో ఉద్యమించాలి



నల్లగొండలో నివాళులర్పిస్తున్న ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి తదితరులు



నకిరేకల్ : సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



కేతేపల్లి : జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు



చిట్యాలలో సుందరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

నల్లగొండ టౌన్ : మానవ హక్కులు, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పోరాటం చేసిన పుచ్చలపల్లి సుందరయ్య స్ఫూర్తితో ఉద్యమించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. పుచ్చలపల్లి సుందరయ్య 38వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి శుక్రవారం స్థానిక దొడ్డి కొమరయ్య భవన్‌లో పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ దక్షిణ భారతదేశంలో కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణానికి బీజాలు వేసి దేశంలోనే తొలి వ్యవసాయ కార్మిక సంఘాన్ని స్థాపించారని కొనియాడారు. పార్లమెంట్ సభ్యుడిగా పార్లమెంట్‌కు సైకిల్‌పై వెళ్లిన గొప్ప నాయకుడన్నారు. అదేవిధంగా పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ కార్యాలయం, కతాల్‌గూడెంలో సుందరయ్యకు ఘనంగా నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో బండ శ్రీశైలం, పాలడుగు నాగార్జున, పాలడుగు ప్రభావతి, సయ్యద్‌హాషం, చినపాక లక్ష్మీనారాయణ, పి.నర్సిరెడ్డి, మహేష్, ఎండీ సలీం, దండెంపల్లి సత్తయ్య, తుమ్మల పద్మ, సైదులు, అశోక్‌రెడ్డి, యాదయ్య, సైదాచారి, వెంకట్‌రెడ్డి, శంకర్, లింగస్వామి, లక్ష్మమ్మ, ముత్తయ్య, దండెంపల్లి సరోజ, పనస చంద్రయ్య, మారయ్య, నరసింహ పాల్గొన్నారు.

కనగల్ : మండల కేంద్రంలోని కామ్రేడ్ వేముల నాగయ్య స్మారక భవనంలో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని శుక్రవారం సీపీఎం, సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించారు. సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాలడుగు ప్రభావతి, కందుల సైదులు, కానుగు లింగస్వామి, ఎండీ అక్రం పాల్గొన్నారు.

నకిరేకల్ : సీపీఎం మండల, పట్టణ కమిటీ ఆధ్వర్యంలో నకిరేకల్‌లో శుక్రవారం పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల, పట్టణ కార్యదర్శులు రాచకొండ వెంకట్ గౌడ్, వంటిపాక వెంకటేశ్వర్లు, నాయకులు యానాల కృష్ణారెడ్డి, ప్రకాష్‌రావు, వంటిపాక కృష్ణ, పుట్ట సత్తయ్య, శశికళ, బుచ్చిరాములు, నర్సింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చిట్యాల : పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి చిట్యాలలోని సీపీఎం కార్యాలయంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్య, జిట్ట సరోజ, నాయకులు పామనగుళ్ళ అచ్చాలు, నారబోయిన శ్రీనివాసులు, శీలా రాజయ్య, ఐతరాజు నర్సింహ, అక్కెనపల్లి నాగయ్య, సుధాకర్‌రెడ్డి, పెద్దులు, మాదరగోని వెంకన్న పాల్గొన్నారు.

కేతేపల్లి : మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో శుక్రవారం సుందరయ్య 38వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, పార్టీ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బొజ్జ చినవెంకులు, మండల కార్యదర్శి సీహెచ్.లూర్దు మారయ్య, కోట లింగయ్య, నంద్యాల సోమిరెడ్డి, గోలి ఎల్లయ్య, సీహెచ్.నాగయ్య, బట్టు కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

మర్రిగూడ : పుచ్చలపల్లి సుందరయ్య 38వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద ఆయన చిత్రపటానికి సీపీఎం మండల కార్యదర్శి ఏర్పుల యాదయ్య పూలమాల వేసి నివాళులర్పించారు. నీలకంఠం రాములు, కొట్టం యాదయ్య, మైల సత్తయ్య, గడగోటి వెంకటేష్, వీఓఏల సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు రంగినేని చంద్రకళ, గంట మంజుల, పానుగంటి పద్మ తదితరులు పాల్గొన్నారు.

# వంటావార్పుతో వీఓఏల నిరసన



చిట్యాలలో వంటావార్పు చేస్తున్న వీఓఏలు

చిట్యాల : తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ చిట్యాలలో వీఓఏలు చేపట్టిన నిరవధిక సమ్మె 33వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా శుక్రవారం వీఓఏలు వంటావార్పు చేస్తూ నిరసన తెలిపారు. సమ్మె శిబిరాన్ని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నారబోయిన శ్రీనివాసులు సందర్శించి మద్దతు తెలిపారు. వీఓఏలకు కనీస వేతన చట్టాన్ని అమలు చేస్తూ వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వీఓఏలు ఏదుళ్ళ లక్ష్మీ, గుడిసె పద్మ, అద్దెల ఉమా, విజయలక్ష్మీ, ఉయ్యాల శోభ, మహంకాళి వనజకుమారీ, దేశపాక సత్తమ్మ, వడ్డగాని విజయ తదితరులు పాల్గొన్నారు.

# చెర్వుగట్టులో ఘనంగా లక్ష పుష్పార్చన



లక్ష పుష్పార్చనలో పాల్గొన్న ఈఓ తదితరులు

నార్కట్‌పల్లి : మండలంలోని చెర్వుగట్టు గ్రామంలో గల శ్రీపార్వతి జడల రామలింగేశ్వర స్వామి ఆలయం శుక్రవారం రాత్రి భక్తులతో కిక్కిరిసిపోయింది. అమావాస్య కావడంతో జిల్లాలోని వివిధ ప్రాంతల నుంచి భక్తులు ఆలయానికి భారీగా తరలివచ్చారు. అమావాస్య రాత్రి ఆలయంలో ఆలయ ప్రధాన అర్చకులు పోతులపాటి రామలింగేశ్వర శర్మ, సతీష్ శర్మ, సురేష్ శర్మ, శ్రీకాంత్ శర్మ ఆధ్వర్యంలో వేద మంత్రాలతో లక్ష పుష్పార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఈఓ నవీన్‌కుమార్ పర్యవేక్షణలో ఆలయ శాఖ సిబ్బంది, పోలీసులు తగు చర్యలు తీసుకున్నారు.

### ధర్నాను విజయవంతం చేయండి

నల్లగొండ : కేజీబీవీ-యూఆర్ఎస్ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 22న కలెక్టర్ కార్యాలయం ఎదుట చేసే ధర్నాను విజయవంతం చేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎడ్ల సైదులు, పెరుమాళ్ళ వెంకటేశ్వర్లు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. కేజీబీవీ, యూఆర్ఎస్‌లలో ఎస్వోలకు, సీఆర్టీలకు, బోధనేతర సిబ్బందికి పీఆర్సీకి అనుగుణంగా బేసిక్ పే వర్తింపజేయాలని, అన్ని రకాల సెలవులు మంజూరు చేయాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, హెల్త్ కార్డులు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలనే కోరారు.

### ఎన్‌ఎంఎంఎస్‌కు కట్టంగూర్ విద్యార్థుల ఎంపిక

కట్టంగూర్ : ఎన్ఎంఎంఎస్(నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్)కు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థులు ఐదుగురు ఎంపికైనట్లు హెచ్ఎం ఆర్ జ్యోతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముశం పవన్‌సూర్య, ఎల్లబోయిన భవాని, హాజ్జి చరణ్, వైనం శ్రీవల్లి, మేడి విద్యశ్రీ ఎంపికయ్యారని అన్నారు. ఎంపికైన విద్యార్థులు 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు ప్రతి సంవత్సరం రూ.12వేల చొప్పున స్కాలర్‌షిప్ పొందనున్నట్లు తెలిపారు.

### పీడీఎఫ్ బియ్యం పట్టివేత

నల్లగొండ క్రైమ్ : నల్లగొండ పట్టణంలోని సావర్కర్ నగర్ ఫ్లైఓవర్ బ్రిడ్జి దగ్గర శుక్రవారం నల్లగొండ టూటౌన్ పోలీసులు పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నారు. విశ్వసనీయ సమాచారం అందడంతో మినీ ఆటోలో తీసుకెళ్తున్న 15 క్వింటాల బియ్యం, మినీ ఆటోను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బియ్యం అక్రమంగా రవాణా చేస్తున్న శేషమ్మగూడెం గ్రామానికి చెందిన చింత వంశీ నకిరేకంటి అఖిల్‌ను అరెస్ట్ చేసినట్టు ఎస్ఐ సంపత్ తెలిపారు.

### ప్రభుత్వ భూమి ఆక్రమిస్తే చర్యలు

చండూరు(గట్టుప్పల) : ప్రభుత్వ భూమిని ఎవరైనా ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తహసీల్దారు లావణ్య అన్నారు. శుక్రవారం గట్టుప్పల మండల కేంద్రం శివారులో సర్వే నంబర్ 353 లో గల 12 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆమె పరిశీలించారు. సర్వే చేయించి హద్దురాళ్లు ఏర్పాటు చేయిస్తామన్నారు. ఆర్ఐ సురేష్, సీనియర్ అసిస్టెంట్ సుదర్శన్, వీఆర్ఏ లక్ష్మయ్య ఉన్నారు.



ప్రభుత్వ భూమిని పరిశీలిస్తున్న తహసీల్దార్